క్లుప్తంగా

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో అధిక శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం విశేష పూజలు చేశారు. విజయదుర్గాకాలనీలోని విజయదుర్గ అమ్మవారికి అర్చకులు రాజేంద్రశర్మ విశేష కుంకుమ పూజలు చేశారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి అమ్మకు అర్చకులు అయ్యన్నశాస్త్రి పంచామృతాలతో అభిషేకాలు చేసి అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చనలు చేశారు. నుదురుపాడులోని కాశీవిశ్వేశ్వర సహిత అన్నపూర్ణకు అర్చకులు భిక్షుల గోత్రాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు కాజలో మెగా వైద్య శిబిరం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని కాజలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో రోగులకు షుగర్, బీపీ, గుండె జబ్బులు, థైరాయిడ్, క్యాన్సర్, కీళ్లు, ఎముకలు, స్త్రీల గర్భకోశ వ్యాధులు, చర్మ, దంత, కంటి వైద్యంతోపాటు ఫిజియోథెరపీ, ఆయుర్వేద వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. దుగ్గిరాల గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను ఆయన రైతు సంఘం నాయకులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలోని 1800 ఎకరాల్లో వరి విత్తనాలు వెద పెట్టారని, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అవి పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెద పెట్టిన రైతులకు రూ.7 వేలు నష్టపరిహారం చెల్లించి, తక్కువ రోజుల్లో పంటకు వచ్చే విత్తనాలను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్.యోగేశ్వరరావు, కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు బి.అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్లు, ప్రింటర్ వితరణ



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో రెండు కంప్యూటర్లను, ఒక ప్రింటర్‌ను అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు కిరణ్ పరుచూరి మాట్లాడుతూ క్లబ్ కోశాధికారి గోపు నాగరాజేష్ ఆర్థిక సహాయంతో సుమారు రూ.50 వేల విలువ గల రెండు కంప్యూటర్లను, ప్రింటర్‌ను తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డికి అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు మున్నంగి వివేకానందరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, శెట్టి రామకృష్ణ, ఆర్.సుకుమార్‌రెడ్డి, కె.గోపీచంద్‌రెడ్డి, గోపు ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని, ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. 15వ డివిజన్ సంగడిగుంట రెడ్ల బజార్ 3వ లైనులో శుక్రవారం సైడు కాలువలు, చెక్కల బజార్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌కుమార్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి కుల, మత పార్టీల కతీతంగా నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నూరీ ఫాతిమా, పాణ్యం మురళీకృష్ణ, మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వాకా శ్రీనివాసరెడ్డి, మస్తాన్‌వలీ, రాంబాబు, అజిత్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ దామర్ల సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



దామర్ల రమాకాంతారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: చేనేత పరిశ్రమ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ దామర్ల రమాకాంతారావు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కొనియాడారు. శాసనమండలి మాజీ సభ్యులు దామర్ల రమాకాంతారావు వర్ధంతి సందర్భంగా పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి రమాకాంతారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ చేనేత పరిశ్రమ అభివృద్ధికి నిరంతరం శ్రమించిన నాయకుడు రమాకాంతారావు అన్నారు. చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్యతో కలసి అనేక చేనేత ఉద్యమాల్లో పాల్గొని కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. చింతక్రింది కనకయ్య హైస్కూల్ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన రమాకాంతారావు ఎందరో పేద విద్యార్థులకు విద్యను అందించారన్నారు. చేనేత కార్మికుల కోసం స్థలాలు మంజూరు చేయించడమే కాకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం నాయకులు చింతక్రింది కనకయ్య, గుత్తికొండ ధనుంజయరావు, జొన్నాదుల వరప్రసాదరావు, రామనాథం పూర్ణచంద్రరావు, దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్రనాథ్, జొన్నాదుల భిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లు, పరిష్కారాలకు ఎకో సిస్టమ్ దోహదం

- వాద్వాని ఫౌండేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ కె సుజాత, సౌత్ రీజియన్ హెడ్ నావేద్ అహ్మద్
- వీఐటీ ఏపీలో ముగిసిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న వాద్వాని ఫౌండేషన్ సౌత్ రీజియన్ హెడ్ నావేద్ అహ్మద్

తాడికొండ: మెరుగైన అవకాశాలను గుర్తించడానికి, కేస్ స్టడీస్ ద్వారా స్టార్టప్ వెంచర్‌లకు సంబంధించిన సవాళ్లు, పరిష్కారాలను గురించి తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని వాద్వాని ఫౌండేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, రీజియన్ సౌత్ హెడ్ నావేద్ అహ్మద్ అన్నారు. ఐనవోలు వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం, వాద్వాని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఇగ్నైట్ ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జులై 25న ప్రారంభమైన ఈ కార్యక్రమం మూడు రోజులపాటు విజయవంతంగా ముగిసిందన్నారు. వ్యవస్థాపక సంస్కృతిని పెంపొందించడానికి, భవిష్యత్తు వ్యవస్థాపకులను పెంపొందించడానికి అధ్యాపకులకు నైపుణ్యాలతో సాధికారత కల్పించే ప్రయత్నంలో భాగంగా వీఐటి-ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూవర్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలువురు స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడంలో, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో వారి అనుభవాలను ఈ ఓరియంటేషన్ ప్రోగామ్ ద్వారా అందిరితో పంచుకున్నారు. కార్యక్రమంలో వీఐటీ ఏపీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, ఐఐఈసీ డైరెక్టర్ డాక్టర్ అమీత్ చవాన్, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ వీఐటీ ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ ఎస్ఎస్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల నిత్యావసర సరుకులు పంపిణీ



తాడేపల్లిరూరల్: అధిక వర్షాల వల్ల పనులు లేక ఇల్లు గడవని పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అండగా నిలబడ్డారు. రూ.రెండు లక్షల విలువైన నిత్యావసర సరుకులను శుక్రవారం ఎంపీపీ దానబోయిన సంతోషరూవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు పేదలకు అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్ల వెంబడి ప్లాస్టిక్, చిత్తు పేపర్లు ఏరుకోవడం, గ్రామంలో చిన్న చిన్న పనులు చేసుకుని జీవించే యానాదులు వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బయటకు వెళ్లలేక పస్తులు ఉంటున్నారని తెలిపారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆర్కే యానాదుల కాలనీలో నివసించే 40 కుటుంబాలకు సుమారు రూ.2 లక్షల విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, ఈమని సొసైటీ అధ్యక్షులు నలుకుర్తి ఏసుపాదం, జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మత్తే ఆనంద్, పెరికలపూడి, మోరంపూడి గ్రామ సర్పంచ్‌లు గంపల గంగాధర్, ఇత్తడి రమేష్, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టండి

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్, పక్కన డెప్యూటీ సూపరింటెండెంట్లు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఉద్యోగుల సమస్యల్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే విధంగా కార్యాలయ అధికారులు పనిచేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆసుపత్రిలోని శుశ్రుత హాలులో శుక్రవారం ఎంప్లాయీస్ గ్రీవెన్స్ హ్యాండ్లింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద మనస్సుతో సమస్యల్ని పరిష్కరించాలని, లేనిపక్షంలో వివరంగా వారికి తెలియజేయాలని చెప్పారు. ఉద్యోగుల నుంచి 16 సమస్యలతో కూడిన వినతి పత్రాల్ని కమిటీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌బాబు దృష్టికి ఆయన తీసుకువచ్చారు. కమిటీ ప్రతి నెలా రెండో శుక్రవారం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు, డెప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ డి.ఎస్. ఎస్. శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ గోవింద నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని, అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లివర్ వ్యాధులకు అందుబాటులో వైద్యం

కాలేయ వ్యాధుల బారిన పడిన వారికి వ్యాక్సిన్, మందులు అందుబాటులో ఉన్నాయని, ఎవరు భయపడాల్సిన అవసరం లేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. వరల్డ్ హెపటైటిస్ డే సందర్భంగా శుక్రవారం జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగంలో ×వన్ లైఫ్.. వన్ లివర్ హెపటైటిస్ అవగాహన పోస్టర్‌ను సూపరిండెంటెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. జీజీహెచ్‌లో లభిస్తున్న ఉచిత వైద్య సేవల్ని వినియోగించుకోవాలని ఆయన రోగుల్ని కోరారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ షేక్ నాగూర్ బాషా, డాక్టర్ శివరామకృష్ణ, పీజీ వైద్యుడు డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీ నమోదు కేంద్రాల నిర్మాణానికి మా స్కాన్ వితరణ

జీజీహెచ్‌లో ఓపీ విభాగం వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పది రోగి పేర్ల నమోదు కేంద్రాల నిర్మాణం కోసం మా అడ్వాన్స్‌డ్ డయాగ్నోస్టిక్ అండ్ రీసెర్చ్ సెంటర్ అధినేత డాక్టర్ మందపల్లి ఆదినారాయణరావు రూ. 2 లక్షలు విరాళం ప్రకటించారు. ఆయన శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌ను కలసి చెక్కును అందజేశారు.

యూసీసీకి వ్యతిరేకంగా రేపు నగరంలో భారీ ర్యాలీ

నెహ్రూనగర్: మణిపూర్‌లో అల్లర్లను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలతోపాటు యూసీసీ (యూనిఫైడ్ సివిల్ కోడ్)కు వ్యతిరేకంగా ఆదివారం నగరంలో ఏసీ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలిపారు. అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ర్యాలీ పోస్టర్లను వివిధ క్రైస్తవ సంఘ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో క్రిస్టియన్లపై దహనకాండ, హత్యాకాండలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మేడ్డు ప్రేమ జ్యోతిబాబు మాట్లాడారు.

ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి



సంగంజాగర్లమూడి ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్‌ని పరిశీలిస్తున్న యూనిడో బృందం

నెహ్రూనగర్: ప్రజా ప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలకు తక్షణ పరిష్కారం లభించే విధంగా చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఆమె శుక్రవారం తన చాంబర్‌లో నగర కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు గుర్తించి, అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యల్ని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విభాగాధిపతుల్ని ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారుల్ని ఆదేశించారు.

సర్వేను మరింత వేగంగా చేపట్టాలి

స్పెషల్ సమ్మరీ రివిజన్- 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టు డోర్ సర్వేను బీఎల్‌ఓలు మరింత వేగంగా చేపట్టేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో నగరంలో సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వేలో వేగం పెరగాలని, బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓట్ల సర్వే చేయాలని చెప్పారు. సూపర్‌వైజర్లంతా ప్రతి రోజు వారి పరిధిలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సర్వేలో పాల్గొనాలని ఆమె ఆదేశించారు. సర్వేలో వెనుకబడిన బీఎల్‌ఓలతో మాట్లాడి, సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, డి.రవీంద్ర, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా అభివృద్ధి పనులు

గుంటూరు నగరంలో కాలుష్యరహితంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంటు ఆర్గనైజేషన్ (యూనిడో) సహకరిస్తోందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం యూనిడో ప్రతినిధులు కమిషనర్‌ని కలసి, నగరంలో చేపడుతున్న పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యరహిత నగరంగా గుంటూరు నగరాన్ని తీర్చిదిద్దడానికి యూనిడో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫండ్ (జీఈఎఫ్) ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తోందని వివరించారు. సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ఫండ్స్ మంజూరు చేసిందన్నారు. పనులు కూడా చివరి దశకు వచ్చాయని, త్వరలో గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణకు కేటాయించిన ఈ-ఆటోల పనితీరును యూనిడో పరిశీలిస్తోందన్నారు. యూనిడో సహకారంలో రానున్న కాలంలో గుంటూరు నగరం స్వచ్ఛ నగరంగా, కాలుష్య రహిత నగరంగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం యూనిడో బృందం సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్‌ని, క్షేత్రస్థాయిలో ఈ-ఆటోల పనితీరుని పరిశీలించింది. కార్యక్రమంలో యూనిడో ప్రాజెక్ట్ బృందం సభ్యులు డాక్టర్ నందపాల్ సింగ్, దీపికా సిరిపాల్, పి.వి.రమణారావు, నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర, ఈఈ కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, ఏఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకం

నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని, టెండర్ పొందిన అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువు మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేసిన పనుల బిల్లుల్ని నూరు శాతం చెల్లించినందుకు కమిషనర్‌ని శుక్రవారం ఆమె చాంబర్‌లో కాంట్రాక్టర్లు కలసి శాలువా కప్పి, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా రమేష్ మాట్లాడుతూ నగరంలో చేపట్టిన పనులకు రూ.10.50 కోట్ల విలువైన బిల్లులకు ఏకకాలంలో చెల్లింపులు చేసిన కమిషనర్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు శివనాగేశ్వరరావు, ప్రభాకర రెడ్డి, జయరామిరెడ్డి, వెంకటరావు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సును విజయవంతం చేయాలి

తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్

మంగళగిరి: తట్టు, దద్దుర్లు రూపుమాపాలని ప్రభుత్వం మిషన్ ఇంద్రధనస్సు పేరుతో చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అన్నారు. నగరంలోని గణపతినగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మిషన్ ఇంద్రధనస్సుపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆగస్టు నుంచి ప్రారంభించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని విజయవంతం చేయాలన్నారు. వ్యాక్సినేషన్ వేయించుకోని 0.2, 0.5 వయస్సు లోపు పిల్లలు, గర్భిణులు సమీపంలోని సచివాలయాల్లో, హెల్త్ సెంటర్‌లలో సంప్రదించి వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. తొలి విడత ఆగస్టు 5 నుంచి 12వ తేదీ వరకు, రెండో విడత సెప్టెంబరు 11 నుంచి 16వ తేదీ వరకూ, మూడో విడత అక్టోబరు 9 నుంచి 14వ తేదీ వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సులోచన, గణపతినగర్, కొప్పురావు కాలనీ, పెదవడ్లపూడి యూపీహెచ్‌సీల వైద్యులు పి.అనూష, ఆర్ సత్యవతి, రమేష్, సూపర్ వైజర్‌లు రత్నకుమారి, జయలక్ష్మి, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు బి.శాంతి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉండే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యురాలు బి.శాంతి అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, 104 ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 103 మంది రోగులకు బీపీ, షుగరు, థైరాయిడ్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల వద్దకు వెళ్లి పిల్లలకు బరువు, ఎత్తు, పరీక్షలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నవారి ఇళ్ల వద్దకు పరీక్షలు చేశారు. శాంతి మాట్లాడుతూ తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఆహారం తీసుకునేటప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని, వేడి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆంతోనిరాణి, బాబురావు, ఆశ కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలు పాల్గొన్నారు.

రైతులకు విత్తన పథకంపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిన పాలెంలో రైతులకు గ్రామ విత్తన పథకంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.హైమావతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి రావాలన్నా, నాణ్యమైన పంట పండాలన్నా మూల విత్తనం నాణ్యంగా ఉండాలని రైతులకు వివరించారు. 30 మంది రైతులకు బీపీటీ 5204 రకం మూల విత్తనం, 7.5 ఓటీఎస్‌ను రైతులకు పంపిణీ చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. మొలక శాతం, విత్తన శుద్ధి, సస్యరక్షణ, పిలక దశల్లో నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, వేప నూనె, వేప పిండిల వాడకం తదితర అంశాలను రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారి పి.శిరీష మాట్లాడుతూ రైతులు పైపాటుగా అధికంగా ఎరువులు, పురుగుమందులు వినియోగించడం ద్వారా ఖర్చులు పెరుగుతాయని, అవసరమైన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సస్యరక్షణ చర్యల ద్వారా ఖర్చు తగ్గించుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో చినపాలెం గ్రామ సర్పంచ్ వాసిరెడ్డి ప్రదీస్, ఏఈఓ ఎ.రమేష్, గ్రామ వ్యవసాయ అధికారులు అలేఖ్య, సామిత్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థినికి కంప్యూటర్ బహూకరణ



బీటెక్ విద్యార్థిని మహాలక్ష్మికి కంప్యూటర్ అందజేస్తున్న జేసీఎస్ కన్వీనర్ దేవిడ్‌రాజు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసముంటూ విజయవాడ లయోలా కాలేజీలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని భవ్య మహాలక్ష్మికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కంప్యూటర్‌ను బహూకరించారు. విద్యార్థినికి వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు శుక్రవారం కంప్యూటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, రైతు విభాగం కన్వీనర్ బందావు రుక్మాంగరెడ్డి, 5వ సచివాలయం కన్వీనర్లు దొంతిరెడ్డి మల్లికార్జునరెడ్డి, తాళ్లూరి ప్రభాత్‌కుమార్ (అమృతరావు) తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి టిఫిన్ బండి అందజేత

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెంకు చెందిన చిరు వ్యాపారి షేక్ యూసబ్ బాషాకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) టిఫిన్ బండిని అందజేశారు. స్థానిక పార్టీ నాయకులు శుక్రవారం యూసబ్ బాషాకు బండిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, దానబోయిన నాగయ్య, షేక్ షఫీ, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాతూరులో చిరువ్యాపారం చేసుకునే నల్లపు దుర్గారావుకు తోపుడు బండి, కావూరు ఏసుకు టిఫిన్ బండిని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శుక్రవారం అందజేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డిబత్తుల సత్యనారాయణరెడ్డి వారికి బండ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు సంకురు మరియబాబు, జంగం రత్నం, కొండూరు సురేష్, మల్లపు సుదర్శనం, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రాతూరు పాములు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



వాహనదారుల వేలిముద్రలు, పత్రాలు పరిశీలిస్తున్న తాడేపల్లి పోలీసులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో తాడేపల్లి పోలీసులు కనకదుర్గ వారధి వద్ద విస్తృత తనిఖీలు చేపట్టారు. సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ బైపాస్ రోడ్ వద్ద ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి తనిఖీలు ప్రారంభించామని, ముఖ్యంగా మైనర్లు, లైసెన్స్ లేనివారు ద్విచక్రవాహనాలు నడపడం, కొంత మంది పాత నేరస్తులు వాహనాలను దొంగిలించి వాటిపై చక్కర్లు కొడుతూ నేరాలకు పాల్పడుతుండడంతో వాటిని నివారించేందుకు తనిఖీలు చేపట్టామని, తనిఖీల్లో భాగంగా పాత నేరస్తులను గుర్తించేందుకు ప్రతి వాహనచోదకుడి వద్ద నుంచి ఫింగర్ ప్రింట్స్ తీసుకుంటున్నామని, ఎక్కడైనా కేసులు నమోదై ఉంటే ఆ సమాచారంతెలుస్తుందని, ఇప్పటి వరకు 150 మందిని తనిఖీ చేయగా సరైన పత్రాలు లేక ఆరు ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు.

రేపు ఎండ్రోక్రైనాలజీ రాష్ట్ర సదస్సు

గుంటూరుమెడికల్: ఎండ్రోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తొలిసారిగా గుంటూరులో ఆదివారం ఎండ్రోక్రైనాలజీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ డాక్టర్ లావణ్య కటకం చెప్పారు. గుంటూరులో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

- రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో స్టైమ్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాల్ని సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. విద్యానగర్‌లోని పాఠశాలలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.